# ఇంకొక విధము

గోపీనాథుడును మలయగిరియు నెప్పుడు గలిసియే తిరుగుచుందురు. మలయగిరి కుడిచేయి గోపీనాథుని భుజమున కెడముగా నున్న నిముసము మనము చూడలేము. మలయగిరి గోపీనాథుని "ఏమండీ" యని పిలుచును. ఇతరులతో జెప్పునపుడు 'వారు' అని ప్రశంసించును. గోపీనాథుడు మలయగిరిని "ఏమిరా!" యని పిలుచును. గోపీనాథునకు సుమారు ముప్పది యేండ్లు. మలయగిరి పదునైదేండ్ల వాడు.

వీరిరువురకు దేహములు మాత్రమే రెండు. మలయగిరికి గోపీనాథుడు తల్లిదండ్రుల కన్న మాననీయుడు. ప్రేమాస్పదుడు. మలయగిరి సుకుమారమైన మొగము పైని వెన్నెల కసుగందక ముందు గోపీనాథునకు ప్రళయము చూచుటయైన నిష్టమే. గోపీనాథుడు మలయగిరితో మాటలాడుచున్నపుడు అతని వదనము మలయగిరి మొగమున కెంత దూరముననో యుండదు. గోపీనాథుని చేతులకు పిన్నగాలికి కదలు మలయగిరి ముంగురుల సవరించుటయే పని.

సాయంసమయ మందు బజారులోని గులాబిపువ్వులను గోపీనాథుడు మలయగిరి కురులయందు ముడుచును. అప్పుడిరువురు నొకరినొకరు చూచుకొని నవ్వుకొనుచుందురు. ఎవరితోనైన గోపీనాథుడు మాటలాడుచు పోవుచున్న, మలయగిరి యతని మోచేతికి తన మోచేయి తగుల్చును. ఒక్కొక్కప్పుడు మాటలాడుచునే తల్లిని బిల్లవలె మలయగిరి గోపీనాథుని యెదురురొమ్ముపై తన తల మోపును.

ఎప్పుడును తనమీద నొరిగి నిదురించు మలయగిరి కదలికి వలననే గోపీనాథునకు మెలకువ. ఒలుచుచున్న నారింజపండు నేనొలిచెదనని గోపీనాథుడడిగిన కొలది మలయగిరి యియ్యక తానే యొలుచుకొనుచు నతని మొగము చూచి నవ్వుచుండును. గోపీనాథుడు బజారున నేవింత వస్తువు చూచినను నది మలయగిరికి తెచ్చిపెట్టకున్న నతనికి నిద్దురపట్టదు. ఒక్కొక్కప్పుడు

గోపీనాథునిపైన దేనికేని కోపము వచ్చి తన్నినను గోపీనాథుడు పోనిమ్మని సంధికి చేయి చాచును. మలయగిరి కన్నీళ్ళతో గవుగిలించుకొనును. అతడు పసివాడని గోపీనాథున కెక్కడలేని ప్రేమ.

గోపీనాథుడు ప్రసిద్ధ నటుడు. సంగీతము లేదు కాని యతని యభినయము నభినందించని విద్యాధికుడు లేడు. అతని పేరు చెప్పిన డబ్బు కురియును. నాటక రంగమున అతని ప్రతిభ యప్రతిమానము. స్వభావసిద్ధముగ నతడు నటకుడగుట – దక్కిన వానికేమి గాని విద్య రానివాడైన యతని వాచకము ప్రశంస కందదు. అతడెప్పుడు నాటకమాడినను ప్రధానపాత్ర యతనిది. తక్కినవారి నెవరినో కూడగట్టి తక్కిరిబిక్కిరిగా నాటకమాడును. నాటకము రక్తికట్టని రాత్రి లేదు.

ఈసారి "పారిజాతాపహరణ" మాడు తలంపతనికి జనించినది. పాత్ర లందరికి పంచినాడు. మలయగిరి సత్యభామ వేయునట్లు. మఱునాటి నుండి మలయగిరిని తయారుచేయ మొదలు పెట్టినాడు. పాపమతడు నోట మాట బట్టలేడు. ఆయుస్సు చాలదు. ఎన్ని విధములనో ప్రయత్నమైనది. నాటకారంభమైనది. నిన్నటి నుండియు గోపీనాథునకు దిగులే. సత్యభామకు తగినవాడు దొరకలేదు. మలయగిరి పాడుచేయును.

నాటకమైపోయినది. జనులందరు గుంపులు గుంపులుగా నిండ్లకేగుచున్నారు. ఎవ్వరినోట చూచినను "కుర్రవాడెవరు? ఆహాహా! ఎంత బాగున్నది! ఆ మౌగ్ధ్యము! ఇంత చిన్న వయసులో నింత నటు డెట్లయినాడు? భార్యాభర్తల యనురాగము వలె నున్నదే వారి నాటకము!" అను మాటయే.